క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

మంగమ్మకు పరామర్శ



మంగమ్మను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: వైఎస్సార్‌సీపీ మండల మహిళ నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ దళవాయి మంగమ్మపై హత్యయత్నం జరగడంతో ఆదోనిలోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఆమెకు ఆపరేషన్ చేసి ఐసీయూలో ఉంచారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి హాస్పిటల్‌కు చేరుకుని ఆమెను పరామర్శించారు.

కల్వర్టుకు మరమ్మతు చేపట్టాలి

కౌతాళం: మండల కేంద్రం నుంచి బదినేహాల్‌కు వెళ్లే రోడ్డులో భారీ వర్షాలకు కల్వర్టు కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల కన్వీనర్ ఈరన్న, బదినేహాల్ గ్రామ నాయకుడు ఉలిగయ్య మాట్లాడుతూ ప్రతి నిత్యం మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రావాల్సి ఉంటుందని, ప్రధానంగా విద్యార్థులు పాఠశాలలకు రావడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చంద్ర, శంకర్, ఈరన్నలు పాల్గొన్నారు.


అనాథ ఆశ్రమానికి ఆర్థిక సాయం



ఆశ్రమ వ్యవస్థాపకురాలు ముత్తులక్ష్మికి నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మంత్రాలయం : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు జ్యోతి అనాథ ఆశ్రమానికి ఆర్థిక సాయం చేశారు. గురువారం మండలంలోని మాధవరం గ్రామ నాయకులు జగన్నాథ్ రూ.5 వేలు, రాజు వెయ్యి చొప్పున ఆశ్రమ నిర్వాహకురాలు ముత్తులక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, పెద్ద చాంద్‌వలి, గుంటిప్ప పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన నాయకులు

ఆదోని అర్బన్: విజయవాడలో వరదల వల్ల ఇళ్లల్లో, కాలనీల్లో పేరుకుపోయిన బురద, చెత్తను తొలగించడానికి ఇటీవల ఆదోని నుంచి 91 మంది పారిశుద్ధ్య కార్మికులు వెళ్లారు. అక్కడ విధులు నిర్వర్తించి గురువారం ఆదోనికి తిరిగి చేరుకున్నారు. వారికి సీపీఐ నాయకులు కల్లుబావిరాజు, జైభీం నాయకులు, జనసేన పార్టీ నాయకులు శాలువాలు వేసి సత్కరించారు.

సీతారాం ఏచూరి మృతికి సంతాపం

ఆదోని సెంట్రల్: భారత కమ్యూనిస్టు(మార్కిస్ట్) సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి ఎస్‌ఎఫ్‌ఐ మాజీ సెంట్రల్ కమిటీ సభ్యులు బి.వెంకన్న గురువారం సంతాపం తెలిపారు. ఆయన మృతి సీపీఎం, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటన్నారు.

అగ్రి విద్యార్థుల క్షేత్ర పర్యటన

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రానికి మడకశిర వ్యవసాయ అగ్రి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు గురువారం ఒక్క రోజు క్షేత్ర పర్యటనకు వచ్చారు. కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా.రాఘవేంద్ర చౌదరి, శాస్త్రవేత్తలు డా. చందన, డా. మౌనిక తదితరులు విద్యార్థులకు ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు. అగ్రి ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లు డా.మంజుల, సహాయ ఆచార్యులు డా.నలబోలు కిషోర్ ల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరుటౌన్: గర్భిణులు హెచ్ఐవీ, అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు ఎం.వీణ సూచించారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో విజయ మహిళా మండలి ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఏయిడ్స్, ఎస్టీఐపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు



పెద్దకడబూరు బీసీ బాలుర వసతి గృహం ఆవరణలో నిలిచిన మురుగునీరు



పెచ్చులూడిన ఆదోని బీసీ బాలుర వసతి గృహం పైకప్పు



ఆదోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



ఎమ్మిగనూరులో అద్దె భవనంలో పోస్ట్‌మెట్రిక్ బీసీ హాస్టల్

సమస్యల్లో సంక్షేమ హాస్టళ్లు

- పేద విద్యార్థులకు అందని సౌకర్యాలు
- అరకొర వసతులతో అవస్థలు
- శిథిలమైన భవనాల్లో భయంభయంగా..
- పట్టించుకోని ప్రభుత్వం



కోసిగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వెనుక భాగంలో నిలిచిన మురుగునీరు,



కోసిగి హాస్టల్‌లో ఇంటినుంచి తెచ్చుకున్న దుప్పట్లపై నిద్రిస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వాలు గురుకుల, సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేశాయి. అయితే వాటి నిర్వహణ సక్రమంగా లేక అరకొర వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరగా, మరికొన్ని చోట్ల సొంత భవనాలు లేక అద్దెభవనాల్లో అరకొర వసతుల్లో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యి రెండున్నర నెలలు గడుస్తున్నా ప్రభుత్వం హాస్టళ్లను పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆదోనిలో 1800 మంది విద్యార్థులు

ఆదోని పట్టణంలో బాలికల ఇంటిగ్రేటెడ్ వసతి గృహం ఒకటి, ఎస్సీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలతో పాటు కళాశాలల హాస్టళ్లు కూడా ఉన్నాయి. 3వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ తరగతులలో చదివే విద్యార్థినీ, విద్యార్థులు వసతి గృహాల్లో చేరుతున్నారు. అయా హాస్టళ్లలో 1800 మంది దాకా విద్యార్థులు వసతి పొందుతున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలతో పాటు పోషకాహారం, ట్రంకు పెట్టెలు, బెడ్ షీట్‌ల వంటివి అందించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు పంపిణీ చేయలేదు. విద్యార్థుల భోజనం కోసం ఇవ్వాల్సిన మెస్ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని వసతి గృహాలకు మార్చి నుంచి అంటే 5 నెలలు బిల్లులు రావాల్సి ఉంది. మరి కొన్ని వసతి గృహాల్లో 7 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో విద్యార్థులకు భోజన సౌకర్యాలను కల్పించడంలో నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతున్నారు.

వసతిగృహాల్లో సమస్యలు..

- పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. ఈ వసతి గృహంలో 160 మంది విద్యార్థినులు ఉన్నారు. మరుగుదొడ్లు సౌకర్యం అంతంత మాత్రంగానే ఉన్నాయి. తాగునీటి విషయానికి వస్తే మున్సిపల్ నీళ్లు వదిలినపుడే పట్టుకోవాలి. వసతి గృహం లోతట్టులో ఉండడం వలన వర్షం వస్తే నీరు అంతా లోపలికి వస్తాయి.
- బీసీ బాలుర హాస్టల్‌లో 3 నుంచి 10వ తరగతి వరకు 250 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే గదులలో పెచ్చులూడడంతో విద్యార్థులు పెట్టెలను వరండాలో పెట్టుకుంటున్నారు. రాత్రిపూట మాత్రం హాస్టల్ పక్కనే ఉన్న పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి రెండు గదులను తీసుకుని అక్కడ పడుకో బెడుతున్నారు.
- ఎస్సీ బాలుర వసతి గృహంలో 98 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ టాయిలెట్స్ 5 ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.
- ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 611 మంది విద్యార్థులు ఉన్నారు. వర్షం వచ్చిందంటే బయట కాలు పెట్టలేని పరిస్థితి. ఆవరణ చుట్టూ నీరు చేరుకుంటాయి. దీంతో విద్యార్థులు పాఠశాలల రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు.

అద్దెభవనాల్లో అరకొర వసతులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్సీ, బీసీ పోస్ట్‌మెట్రిక్, ప్రీ మెట్రిక్ సంక్షేమ వసతి గృహాలు అరకొర వసతులతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గుడికల్ రోడ్డులోని బీసీ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లోపై అంతస్తులో గదులు వుండటం, కింద ఆరుబయట నుంచి స్నానపు గదులు, మరుగుదొడ్లకు వెళ్లేందుకు దారి ఉండటంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. దీనికి తోడు కాస్మోటిక్ చార్జీలు మంజూరుకాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌కు మెయింటెనెన్స్ నిధులతో పాటు పలు బిల్లులు మంజూరు కాక నిర్వహణ కోసం అవస్థలు పడుతున్నామని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హాస్టల్‌లో సమస్యల తిష్ట

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో ఇంటి గ్రేటెడ్ హాస్టల్ ఏర్పాటు చేశారు. ఇందులో 3 నుంచి 10వ తరగతి వరకు 210 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్‌లో విద్యార్థులు దుస్తులు, వస్తువులు భద్రపరుచుకునేందుకు ట్రంక్ పెట్టెలు 2008లో ఇచ్చినవే కొనసాగుతున్నాయి. అందరికీ ట్రంక్ పెట్టెలు అందుబాటులో లేక కొందరు సొంతంగా తెచ్చుకున్నారు, మరి కొందరు బ్యాగులలోనే పుస్తకాలు, బట్టలు, దుప్పట్లు పెట్టుకుని కాలం గడుపుతున్నారు. అలాగే గతేడాది విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. ఈ ఏడాది ఇంత వరకూ దుప్పట్లు అందించలేదు. త్వరలో చలికాలం రాబోతోందని ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లుతోనే గడుపుతున్నారు. మరికొందరు దుప్పట్లు లేక అలాగే నిద్రించాల్సి వస్తోంది. పలు గదులలో ఫ్యాన్లు కూడా రిపేరి ఉన్నాయి. హాస్టల్ ముందు భాగంలో వర్షం వస్తే కారుతుండడంతో పాటు లైట్లు వెలగడంలేదు. విద్యార్థులు బయటకు రావాలంటే చీకటి మయంగా ఉంది. అలాగే హాస్టల్ వెనుక భాగంలో మురుగు నీరు నిల్వ ఉంది. దుర్వాసన వెదజల్లుతూ కంపుకొడుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో తాగునీటి లేకపోవడంతో వార్డెన్ రోజు వారీగా బయట నుంచి ఫిల్టర్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నారు. అలాగే విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు, మెస్ బిల్లులు రావడం లేదని వార్డెన్ చెబుతున్నారు. అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వడ్డించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోసిగి హాస్టల్ ముందుభాగంలో వెలగని విద్యుత్ దీపాలు

పెచ్చులూడుతున్నా పట్టించుకునేవారేరి

పెద్దకడబూరు : మండల కేంద్రంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల బాధలు పట్టించుకునేవారు కరువయ్యారు. ఇందులో 135 మంది విద్యార్థులు ఉంటున్నారు. వారికి మొత్తం 6 గదులు ఉండగా 4వ నంబర్ గదిలో పెచ్చులూడిపోయి విద్యార్థులపై పడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం. ఆ గదిలో ఫ్యాన్ లేకపోవడంతో దోమలు దాడికి తట్టుకోలేక విద్యార్థులు రాత్రి భోజనం అనంతరం డైనింగ్ హాల్‌లో నిద్రిస్తున్నారు. వర్షం వస్తే కాంపౌండ్ భయట ఉన్న డ్రైనేజీలోని మురుగు నీరు లోపలికి వచ్చి ఆవరణ మురుగునీటితో నిండిపోతుంది. ఎంతమంది అధికారులు వచ్చి సమస్యను నోట్ చేసుకున్నా ఇప్పటికీ సమస్య పరిష్కారం కావడంలేదు.

ఇంటి నుంచి పెట్టె తెచ్చుకున్నాం



హాస్టల్‌లో ఉండి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. ఈ ఏడాది కొత్తగా హాస్టల్ చేరాను. అయితే హాస్టల్‌లో ట్రంక్ పెట్టె ఇవ్వక పోవడంతో ఇంటి నుంచే తెచ్చుకున్నాం. అలాగే హాస్టల్ వెనుక భాగంలో మురుగు నీరు నిల్వ ఉంది. దుర్వాసన వస్తోంది. మురుగు నీటిని తొలగించాలి.

– జీవన్ కుమార్, జుమ్మాలదిన్నె

సమస్యలు పరిష్కరించాలి



హస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలి. అద్దెభవనాల్లో వసతులు లేవు. అందువలన సొంత భవనాలు నిర్మించాలి. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు, మెస్ చార్జీలు మంజూరు చేయాలి.

–వీరేష్‌యాదవ్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మిగనూరు

సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు



విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వం విడుదల చేసిన మెస్ బిల్స్‌ను అయా వసతి గృహాలకు అందించాం. ఇంకా మెస్ బిల్స్ రావాల్సి ఉంది. మెస్ బిల్స్ వచ్చేంత వరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన భోజనం, వసతి సౌకర్యాలను కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. బీసీ బాలుర వసతి గృహం మరమ్మతు కోసం నిధులు కూడా మంజూరయాయ్యి. త్వరలో పనులను కూడా ప్రారంభిస్తారు.

– కె. బాబు ఏఎస్‌డబ్ల్యూఓ, ఆదోని

వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న ఇన్సాఫ్ కమిటీ పట్టణ గౌరవాధ్యక్షుడు కేసీ జబ్బార్

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణను సత్వరం ఉపసంహరించుకోవాలని, వక్ఫ్ ఆస్తుల జోలికి వస్తే సహించేది లేదని ఇన్సాఫ్ పట్టణ కమిటీ గౌరవాధ్యక్షుడు కేసీ జబ్బార్, అధ్యక్షుడు సమీవుల్లా, కార్యదర్శి రహిమాన్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఇన్సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ 40 ప్రతిపాదనలను ప్రవేశపెట్టిందని చెప్పారు. ఇది ముస్లిం మైనారిటీలకు తీవ్ర అన్యాయం జరిగేలా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ముస్లింల అభ్యున్నతి పట్ల చిత్తశుద్ధి వుంటే రంగనాథ మిశ్ర, సచార్ కమిటీ సిఫారసులను అమలు చేయాలన్నారు. సమావేశంలో ఇన్సాఫ్ కమిటీ నాయకు దాదావలి, ఖాజ, ఇస్మాయిల్, అజారుద్దీన్, ఖాదర్, సమీర్, నబిసాబ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



అధికారులకు సూచనలు ఇస్తున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

గోనెగండ్ల : గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని డీఎల్‌పీఓ నూర్జహాన్ అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తలను సేకరించి సంపద తయారీ కేంద్రంలో ఎరువులను తయారు చేయాలన్నారు. ఎరువులను పొలాల్లో వేసుకునేందుకు రైతులకు విక్రయించాలన్నారు. దీంతో గ్రామ పంచాయతీకి ఆదాయంతో పాటు రైతులకు తక్కువ ధరకే ఎరువు దొరుకుతుందన్నారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ సతీష్, సర్పంచ్ హైమవతి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ వ్యవస్థను కాపాడాలి



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకురాళ్లు

ఆదోని టౌన్: అర్థంపర్థం లేని జీవో నం.115ను రద్దు చేయాలని, నర్సింగ్ వ్యవస్థను కాపాడాలని కాంట్రాక్టు స్టాఫ్ నర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకురాళ్లు డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రోగుల సంరక్షణలో కీలకంగా వ్యవహరించే నర్సింగ్ వ్యవస్థని అపహాస్యం చేస్తూ ప్రభుత్వాలు సర్వీస్ ఏఎన్ఎంలకు మూడు సంవత్సరాల పాటు ఇవ్వాల్సిన జీఎన్ఎం శిక్షణను ఇంటెన్సిఫైడ్ ప్రోగ్రాం ప్రవేశపెట్టి 18 నెలలపాటు నామ మాత్రపు శిక్షణ ఇవ్వడం మంచి పద్ధతి కాదన్నారు. దీని ద్వారా నర్సింగ్ ఉద్యోగాలను ఇవ్వడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన స్కూల్‌గేమ్స్



ఎమ్మిగనూరులో కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ ఆంజనేయులు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 14, 17 సంవత్సరాల్లోపు బాల, బాలికల మండల, తాలూకా స్థాయి క్రీడాపోటీలను గురువారం ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, బ్యాడ్మింటన్, చెస్, అథ్లెట్స్ పోటీలను రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తాలూకా కోఆర్డినేటర్ యండి.అస్లాం బాష, మండల కోఆర్డినేటర్ బజారప్ప పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్, క్రీడల మండల కోఆర్డినేటర్ పీడీ రాజారామ్ ఆధ్వర్యంలో పోటీలు ప్రారంభించారు. పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు రామచంద్ర, వెంకటేష్, శివ, మహేంద్రమ్మ, గంగాధర్, శేఖర్, బసవ తదితరులు పాల్గొన్నారు.

నందవరం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ పోటీలను ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి ప్రారంభిచారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరక్టర్ మహమ్మద్ హనీఫ్, హెచ్ఎం శివరామ్, వ్యాయమ ఉపాధ్యాయులు ఈరన్న, ప్రశాంతి, పాఠశాల సిబ్బంది పాలొన్నారు.

పెద్దకడబూరు: మండల కేంద్రంలో ఎస్‌జీఎఫ్ఐ గేమ్స్ మండల కోఆర్డినేటర్ స్వర్ణలత ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించిన స్కూల్ గేమ్స్ క్రీడలు గురువారంతో ముగిశాయి.

నీటి సమస్య పరిష్కరించాలి

నందవరం : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో నీటి సమస్యను పరిష్కరించాలని బీఎస్పీ నాయకులు దేవదానం, ఎద్దుల చెన్నయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో ఎంఈఓ–2 రఘునాథ్‌కి వినతి పత్రం అందజేశారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి



గిడ్డయ్య (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆలూరు రోడ్డులోని కల్లుబావి వీధికి చెందిన గిడ్డయ్య(54)ను ఆయిల్ ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో గురువారం మృతిచెందాడు. ట్రాఫిక్ ఏఎస్ఐ లక్ష్మన్న తెలిపిన మేరకు వివరాలు.. గిడ్డయ్య ఉదయం బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగొస్తున్న సమయంలో వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ వచ్చి ఢీకొట్టింది. దీంతో గిడ్డయ్య అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతుడికి భార్య సరోజమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడు ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: దేవరబెట్ట క్రాస్ రోడ్డు వద్ద కోసిగికి చెందిన కంపాటి మధు కృష్ణ, భూగేని రవిలు బజాజ్ పల్సర్ బైక్‌పై కర్ణాటక నుంచి 768 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు కోసిగి సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. రెండు బైక్‌లను, మద్యం బాటిళ్లను సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ కె.నాగరాజు, కానిస్టేబుల్ యస్, నాగరాజు, మధుసూదన్‌లు ఉన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం సత్వరం నిలిపివేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హనీఫ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరారు. సమావేశంలో రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ఏసేపు, రవి, నవీన్‌ఠాకూర్, అజయ్, కృష్ణ పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం సాగుతో లాభాలు

గోనెగండ్ల /నందవరం: రైతులు ఆయిల్ పాం పంటను సాగుచేసుకుంటే దిగుబడితో అధిక లాభాలు వస్తాయని ఉద్యానవన శాఖ అధికారిణి శ్రీవాణి తెలిపారు. గురువారం హెచ్. కైరవాడి గ్రామంలో, నందవరంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సమయపాలన పాటించాలి

పెద్దకడబూరు: సచివాలయ ఉద్యోగులు కచ్చితంగా సమయపాలన పాటించాల్సిందేనని ఎంపీడీఓ జనార్దన్ హెచ్చరించారు. గురువారం సాక్షిలో ప్రచురితమైన 'విధులు వారిష్టం' కథనానికి స్పందించిన ఆయన సచివాలయ ఉద్యోగులతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చాలా సార్లు హెచ్చరించినా, మార్పు కనిపించడం లేదని మండిపడ్డారు. ఇకనైనా సమయపాలన పాటించి ప్రజా సమస్యలపై దృష్టిపెట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ఉన్నారు.

తాగునీరు కలుషితం

కౌతాళం: గ్రామంలోని ఇందిరానగర్ రెండవ రోడ్డు పెద్దంటి కాశయ్య ఇంటి వద్ద ఉన్న మంచినీటి పైపులైన్ వాల్‌లో మురుగునీరు చేరుతోందని ఎంఆర్‌పీఎస్ కౌతాళం గ్రామ కమిటీ సభ్యులు ఆనంద్‌రాజు, కార్యదర్శి రామాంజినేయులు గురువారం సర్పంచ్ పాల్‌దినకర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నీటి వల్ల కాలనీ వాసులకు వాంతులు, వీరేచనాలు, జబ్బుల బారిన పడుతున్నారని, తక్షణమే వాల్‌ను మార్చి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

వీఆర్వో రమేష్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: నందవరం మండలంలోని పెద్దకొత్తిల్లి వీఆర్వోగా పని చేస్తున్న రమేష్ రైతుల భూములను తారుమారు చేసి, అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, జి.రంగన్న డిమాండ్ చేశారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పెద్దకొత్తిల్లి గ్రామంలో భూమిని నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న పేద రైతుల భూములను వేరే వ్యక్తులకు వేలాది రూపాయలు లంచం తీసుకుని బదిలీ చేస్తున్నారన్నారు. ఆయన బాధితులు 70 మంది ఉన్నారని, వెంటనే విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు వెంకటేశ్వర్లు, రాఘవరెడ్డి, మల్లేష్, నగేష వీరేష్, సరోజమ్మ, ఉరుకుందు, సీపీఐ నాయకులు విజయ్, రవి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన పవన్‌కుమార్, వీరేష్, శ్రీకాంత్‌లు గణేష్ నిమజ్జనానికి వెళ్లి బైకుపై తిరిగొస్తుండగా బైకు అదుపు తప్పి గాయాలపాలయ్యారు. ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపిన మేరకు వివరాలు.. గురువారం రాత్రి నిమజ్జనం ముగించుకొని తిరిగొస్తుండగా మదిరె గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పడంతో పై ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వారిని ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఇందులో పవన్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

బైకులు ఢీకొని గర్భిణికి గాయాలు

మండలంలోని చిన్నహరివాణం గ్రామ సమీపంలో గురువారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో జయలక్ష్మి అనే గర్భిణికి గాయాలైనట్లు ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపారు. చిన్నహరివాణం గ్రామానికి చెందిన ఆనంద్, భార్య జయలక్ష్మి(గర్భిణి) బైకుపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైకు ఢీకొట్టడంలో ఆమె గాయాలపాలయ్యారు. వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

పురుగుమందు సేవించిన ఇద్దరికి అస్వస్థత

పట్టణంలోని అమరావతినగర్‌కు చెందిన శివ, చిన్నపెండేకల్ గ్రామానికి చెందిన వృద్ధురాలు నరసమ్మ పురుగుమందు సేవించి గురువారం అస్వస్థతకు గురయ్యారని ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వారు వేర్వేరు సందర్భాల్లో పురుగుమందు సేవించారు. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.